సాక్షి
వికారాబాద్

గురువారం । 12 । అక్టోబర్ । 2023



నిబంధనలు తప్పనిసరి

ఎన్నికల నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలు విధిగా పాటించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. 10లో▸



పరిసరాలు శుభ్రంగా ఉండాలి

వికారాబాద్‌లోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశుభ్రంగా ఉండాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. 10లో▸



వణికిస్తున్న విషజ్వరాలు

పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో జనం ఆస్పత్రుల బాట పట్టారు. 11లో▸

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండండి



అనంతగిరి: ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఎన్నికల విధులపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో మూడు ఫ్లయింగ్ టీంలు ఉంటాయన్నారు. మద్యం, డబ్బు అక్రమ రవాణాపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ. 20.33లక్షలు సీజ్ చేశామని, 31మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

కంట్రోల్ రూం ఏర్పాటు



ఎన్నికల కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న షఫీవుల్లా తదితరులు

తాండూరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ షఫీవుల్లా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కోడ్ ఉల్లంఘించినా, ఎన్నికలకు సంబంధించిన సమస్యలపై కంట్రోల్ రూంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆనంద్ గెలుపునకు కృషి చేయాలి



మంత్రి కేటీఆర్‌తో ఎంపీ, ఎమ్మెల్యే, నందు

అనంతగిరి: కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న బీఆర్‌ఎస్ నాయకుడు వడ్ల నందు బుధవారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి మంత్రి కేటీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిశారు. ఎమ్మెల్యే ఆనంద్ గెలుపునకు సహకరించాలని కేటీఆర్ నందుకు సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

ఆలయ భూములను పరిరక్షిస్తాం

దేవాదాయ శాఖ డిప్యూటీ కలెక్టర్ అనిత



భూ రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

తాండూరు రూరల్: ఆలయ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూస్తామని దేవాదాయ శాఖ డిప్యూటీ కలెక్టర్(ల్యాండ్ విభాగం)అనిత అన్నారు. బుధవారం మండలంలోని దస్తగిరిపేట్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయ భూములను ఆక్రమించినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దస్తగిరిపేట్‌లోని ఆలయానికి సర్వే నంబర్ 161, 162లో 28 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి చుట్టూ కంచె వేసి బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ల్యాండ్ విభాగం తహసీల్దార్ హరిత, ఏఓ శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని పార్టీ కాంగ్రెస్

మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామంలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికలప్పుడు ఒక మాట ఆ తర్వాత మరో మాట మాట్లాడడం అలవాటైపోయిందన్నారు. కార్యక్రమంలో అనన్యచేతస్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు జాఫర్ పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిదే

భరోసాతో బీఆర్‌ఎస్

- ఆత్మవిశ్వాసంతో కాంగ్రెస్
- తాము సైతం అంటున్న బీజేపీ
- ఎన్నికలకు సిద్ధమవుతున్న పార్టీలు



కొడంగల్: తెలంగాణలో కొడంగల్ అసెంబ్లీ స్థానానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కాంగ్రెస్ పక్షాన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఇక్కడ పోటీ చేయనున్నారు.దీంతో రాష్ట్ర ప్రజల దృష్టి కొడంగల్‌పై ఉంటుందని పలు పార్టీల నేతలు అంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే టికెట్ ఖరారైన బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గ్రామాల్లో తిరుగుతూ తన విజయంపై భరోసాగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయ నున్న రేవంత్‌రెడ్డి కొడంగల్ ప్రజలపై నమ్మకంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. కేంద్రంలో అధికారం ఉన్న బీజేపీ పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఎందుకంటే గతం నుంచి ఇప్పటి వరకు పార్టీని నడిపించే నాయకుడు లేక బీజేపీ శ్రేణులు నిరాశలో ఉన్నారు.

జోరు మీదున్న బీఆర్‌ఎస్

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారిని కలిసి కారు గుర్తుకు ఓటేయాలని కోరు తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కా ర్యకర్తలు, నాయకులతో ప్రచారం చేయిస్తున్నారు.

గెలుపుపై ధీమా

ఆత్మవిశ్వాసంలో కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ప్రజలు తనను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని రేవంత్‌రెడ్డి విశ్వసిస్తున్నారు. తనను గెలిపించి కొడంగల్ ఆత్మగౌరవాన్ని చాటుతారని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల నియోజకవర్గంలో ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.

ఊసేలేని బీజేపీ

జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న బీజేపీ నియోజకవర్గంలో ప్రభావం చూపలేకపోతోంది.గతం నుంచి బీజేపీని నడిపించే నాయకుడు లేకుండా పోయాడు.వలస నేతలతో అసెంబ్లీ ఎన్నికలను కానిస్తున్నారు.2018లో అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం రెండు శాతం మించి ఓట్లు సాధించలేకపోయారు.కేవలం 2,624 ఓట్లుసాధించి నాలుగో స్థానంలో నిలిచింది. ఈసారి పోటీ చేయడానికి పెద్ద నేత లు ఎవరూ ముందుకు రాలేదు. నియోజకవర్గంలోని పలువురు పార్టీ అభిమానులు తాము పోటీ చేస్తామని అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు.

కొడంగల్ రాజకీయాలు

కొడంగల్‌లో మొత్తం 2,30,251 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,14,140 మంది, స్త్రీలు 1,16,099 మంది, ట్రాన్స్‌జెండర్లు 12 మంది ఉన్నారు. పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ ఏడాది ఆగస్టు ఒకటిన ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాతో పోలిస్తే ప్రస్తుతం ఓటర్ల సంఖ్య పెరిగింది. తుది జాబితాలో తేలిన లెక్క ప్రకారం ఒక్క కొడంగల్ నియోజకవర్గంలో 10,835 మంది కొత్త ఓటర్లు పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో పురుషులు 4,978 మంది, 5,860 మంది మహిళలు ఉన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని అధికారులు జోరుగా ప్రచారం చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టి కొత్త ఓటర్లను చేర్పించారు. 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయించడంలో అధికారులు విజయం సాధించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

‘కోడ్’ అమలు బాధ్యత మనదే

- ఇందుకు సమాయత్తం కావాలి
- ఉల్లంఘనలను ఉపేక్షించొద్దు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం

వికారాబాద్ అర్బన్: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాల్సిన పూర్తి బాధ్యత మనపైనే ఉందని, ఇందుకు అధికారులు, సిబ్బంది సమాయత్తం కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సహాయ వ్యయ పరిశీలకులు, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీలకు మాస్టర్ ట్రైనీలతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిందిస్థాయి సిబ్బంది సక్రమంగా పని చేసినప్పుడే ఎన్నికలు సజావుగా జరుగుతాయన్నారు. కోడ్ అమల్లో ఉన్నందున ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించాలని, గోడలపై రాతలను చెరిపి వేయాలని ఆదేశించారు. ర్యాలీలు నిర్వహించినా, అక్రమంగా డబ్బు, మద్యం తరలించినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యం వార్తా పత్రికలు, టీవీల్లో వచ్చే ప్రకటనలను పరిశీలించి ఎన్నికలకు సంబంధించినవి అయి తే వాటి ఖర్చులను నమోదు చేయాలన్నారు. ఫేస్ బుక్,, ట్విట్టర్, సోషల్ మీడియాలపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఎలాంటి కార్యక్రమాలు జరగకుండా చూడాలన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సీ విజిల్ యాప్ ద్వారా లైవ్ ఫొటోలు, వీడియోల ద్వారా నేరుగా ఫిర్యాదులు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని వివరించారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల ఖర్చును పరిశీలించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థి రూ. 40 లక్షలకు మించి ఖర్చు చేయడానికి అవకాశం లేదన్నారు. వార్త పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడానికి ముందు ఎంసీఎంసీ ద్వారా అనుమతి పొందాలని ఆదేశించారు. రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా, కులం, మతం, జాతిని కించపరిచేలా మాట్లాడినా, వ్యక్తిగత దూషణలు చేసినా కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్‌డీఓ కృష్ణన్, ఆర్డీఓ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.



యాలాల: జుంటుపల్లిలో కాంగ్రెస్ గ్యారంటీ పథకాలపై ప్రచారం చేస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి
- ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం

యాలాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే ప్రజా సంక్షేమం సాధ్యమని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ నేత డాక్టర్ సంపత్ కుమార్‌తో కలిసి జుంటుపల్లిలో ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రజలను మోసం చేసిందన్నారు. గ్రూపు -1 పరీక్షలు నిర్వహించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కల్లిబొల్లి మాటలతో అధికార పార్టీ నాయకులు త్వరలో ప్రజలు ముందుకు వస్తారని, వారికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేస్తామని తెలిపారు. రైతుల పాలిట శాపంగా మారిన ధరణి వెబ్ సైట్‌ను తొలగిస్తామని అన్నారు. అంతకుముందు జుంటుపల్లి రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, ఎంపీటీసీ మాణిక్యమ్మ, మాజీ సర్పంచ్ మల్లప్ప, నాయకులు చంద్రశేఖర్ గౌడ్, ఖాసీం, శ్రీనివాస్, ప్రశాంత్, ముస్తఫా, విజయ్‌కుమార్, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

తాండూరు టౌన్: పట్టణంలోని 5వ వార్డు ఇందిరా నగర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌కు చెందిన యువకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇందిరా నగర్, పాత తాండూరు ప్రాంతాల్లో ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మోసపూరిత పథకాలను నమ్మరాదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ప్రభాకర్ గౌడ్, సంతోష్, నాగేందర్, ఎండీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

భూమాతను కాపాడుకుందాం

కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లీలా లక్ష్మారెడ్డి

కడ్తాల్: సర్వప్రాణుల సేవయే మాధవసేవగా భావించి భూమాతను కాపాడుకోవాలని కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు నిర్వహించిన ‘ఎర్త్ లీడర్‌షిప్ ఫర్ సస్టైనబుల్ - మేరా మిట్టి మేరాదేశ్’ శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆనందకరమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయాలంటే విద్యార్థుల్లో సమగ్ర పరివర్తన జరగాలని సూచించారు. పర్యావరణ రక్షణలో విద్యార్థులు ప్రధాన భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. సహజ వనరులు సగానికి పైగా కరిగిపోయాయని, నేడు ప్రపంచం పర్యావరణ సంక్షోభం ముంగిట నిలబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరంతో పాటు, రేపటి తరాల సుస్థిరతకు భంగం వాటిల్లకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు. డాక్టర్ తులసీరావు మాట్లాడుతూ.. అంతరించిపోతున్న జీవజాతులను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. నల్లమల అడవుల్లో ఉన్న జీవ జాతుల జీవన విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శశికళ, సీజీఆర్ ప్రోగ్రాం నిర్వాహకులు రత్నం వెంకటేశ్, నగేశ్, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ‘శివసాగర్’



శివసాగర్ చెరువును కబ్జా చేసి ఫెన్సింగ్ వేసిన అక్రమార్కులు

- యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్న చెరువు
- అక్రమార్కులకు నేతలు, అధికారుల అండదండలు
- వికారాబాద్‌కు తాగునీటి సరఫరాపై ప్రభావం

వికారాబాద్: ఈ ఫొటోలో కనిపిస్తున్నది వికారాబాద్ పట్టణానికి దశాబ్దాలుగా తాగునీరు అందిస్తున్న శివసాగర్ ప్రాజెక్టు.. హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు చెరువును యథేచ్ఛగా కబ్జా చేశారు. ఇందులో ఫాం హౌస్‌ల నిర్మాణం చేపట్టారు. బీటీ రోడ్లు సైతం వేశారు. గతంలో జిల్లాలో విధులు నిర్వహించిన ఓ ఉన్నతాధికారి చెరువు విస్తీర్ణంలోని కొంత భూమిని నిబంధనలకు విరుద్ధంగా తమ బంధువులకు ధారదత్తం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ముమ్ముందు సమస్యలు రాకుండా రికార్డులను సైతం తారుమారు చేసినట్టు తెలుస్తోంది. ఫైవ్ మెన్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే నిర్మాణాలు, వెంచర్లకు అనుమతులు ఇచ్చారని మున్సిపల్ అధికారులు అంటున్నారు.

శివసాగర్ చుట్టూ కబ్జాలే

మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏదైనా సమస్య వస్తే వికారాబాద్ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేది శివసాగర్ ప్రాజెక్టే. ఈ చెరువు సామర్థ్యం 2.25 క్యూబిక్ మిలియన్ లీటర్లు. కబ్జాల కారణంగా చెరువు మొత్తం అడుగంటే అవకాశం ఉంది. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. శివసాగర్‌కు నాలుగు వైపులా ఆక్రమణలు జరుగుతున్నాయి. కొందరు బడా బాబులు ఈ చెరువును కబ్జా చేసి ఫాంహౌస్‌లు నిర్మిస్తుండగా, మరికొందరు చెరువు చివరి భాగాన్ని పూడ్చి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు.

అందరూ పాత్రధారులే

చెరువు కబ్జాలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాత్రధారులుగా మారుతున్నారు. నియోజకవర్గ ముఖ్య నేతల కనుసన్నల్లోనే కబ్జా చేసి వెంచర్లు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చెరువుతో పాటు చుట్టు పక్కల గల అసైన్డ్ భూములను సైతం కబ్జా చేసి వెంచర్లలో కలుపుకొంటున్నట్లు తెలిసింది. చెరువు కబ్జాతో కోట్లు వస్తుండడంతో రియల్టర్లు నేతలకు, అధికారులకు పర్సంటేజీలు ఇస్తున్నట్లు సమాచారం.ఏది ఏమైనా ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే చెరువు కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

అంతా మా ఇష్టం..!

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పరిగి విద్యుత్ శాఖ అధికారులు
- ఎస్టిమేషన్లు లేకుండా పనులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



న్యామత్‌నగర్‌లో ఎలాంటి ఎస్టిమేషన్ లేకుండా వేసిన విద్యుత్ స్తంభాలు

పరిగి: పరిగి విద్యుత్ శాఖలో పని చేస్తున్న అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమార్జనే లక్ష్యంగా పనులు చేస్తున్నారు. దీంతో ఆ శాఖకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. సాధారణంగా ప్రైవేటు వ్యక్తుల అవసరాల కోసం విద్యుత్ లైన్లు, స్తంభాలు మార్చాలన్నా, కొత్త స్తంభాలు వేయాలన్నా ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి.. ఇందుకు అనేక నిబంధనలు ఉన్నాయి. ఎవరైనా వ్యక్తిగత అవసరాల కోసం విద్యుత్ లైన్లు మార్చాలంటే ముందుగా ఆ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత ఏఈ క్షేత్రస్థాయిలో పరిశీలించి లైన్ ఎంత దూరం ఉంది.. ఎన్ని స్తంభాలు అవసరం, ఎంత వైర్ పడుతుంది.. ఎంత ఖర్చు వస్తుంది అనే దానిపై ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. అనుమతులు వచ్చిన తరువాత టెండర్లు పిలిచి ఆ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. అయితే ఎస్టిమేషన్ మొత్తంలో పది శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనలు పరిగి విద్యుత్ శాఖ అధికారులు ఏ మాత్రం అమలు చేయడం లేదు. ఎలాంటి ఎస్టిమేషన్లు వేయకుండానే సొంతంగా పనులు చేయిస్తున్నారు. దీంతో ప్రైవేటు పనుల నుంచి విద్యుత్ శాఖకు రావాల్సిన కోట్ల రూపాయలకు గండి పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడంపై ఆ శాఖలోని కొందరు ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తే వారిని వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. పట్టణాలు, గ్రామాల్లోని ఫాం ల్యాండ్స్‌కు విద్యుత్ లైన్లు కావాలని, పొలాల మధ్యలో ఉన్న స్తంభాలను పొలం గట్టు వద్ద వేయాలని వచ్చే వారి నుంచి లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఎలాంటి ఎస్టిమేషన్లు లేకుండా అధికారులు వారి పనులు పూర్తి చేసి డబ్బు దండుకుంటున్నారు. ఎవరైనా ఇదేమని ప్రశ్నిస్తే నిబంధనల ప్రకారం పనులు చేయాలంటే ఖర్చు ఎక్కువ వస్తుందని, తాము చెప్పినట్లు చేస్తే సకాలంలో పనులు పూర్తవుతాయని సలహాలు ఇస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇస్తే తామే మెటీరియల్ తెచ్చి పనులు చేస్తామని ఒప్పిస్తున్నారు. దీంతో విధిలేక అధికారుల మాటలకు తలొగ్గి పనులు చేయించుకుంటున్నారు. ఎల్‌టీ లైన్ కావాలన్నా, లైన్ మార్చాలన్నా, సైడ్ ఆరామ్స్ వేయాలన్నా కచ్చితంగా ఎస్టిమేషన్ వేసి అందులో 10శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే ఇవేమీ లేకుండానే ప్రజల నుంచి లక్షల్లో డబ్బులు తీసుకొని పనులు చేస్తున్నారు. దిన దినాభివృద్ధి చెందుతున్న పరిగి పట్టణంలో ప్రజల వ్యాపార, ఇతర అవసరాల కోసం విద్యుత్ లైన్లు మార్చాల్సి ఉంటుంది. నిత్యం ఇందుకు సంబంధించిన పనుల కోసం ప్రజలు, వ్యాపారులు వస్తూనే ఉంటారు. అయితే ఎస్టిమేషన్ వేసి, ప్రభుత్వ అనుమతి వచ్చిన తరువాతే పనులు చేపట్టాలి. కానీ అధికారులు అక్రమ మార్గంలో పనులు చేస్తున్నారు. మీరెలా పనులు చేస్తారని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తే వారి పనులు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం.

ఎస్టిమేషన్లు లేకుండా చేసిన పనులు

- న్యామత్ నగర్‌లోని ఓ ఫాం హౌస్‌కు ఎలాంటి ఎస్టిమేషన్లు వేయకుండానే 14 స్తంభాలు వేసి, ఫైవ్ లైన్ ఎల్‌టీ పనులు పూర్తి చేశారు. దీంతో ప్రభుత్వం రూ. 5లక్షల ఆదాయం కోల్పోయింది.
- నస్కల్ గ్రామంలో 11కేవీ లైన్‌ను మార్చారు. దీనికి కూడా ఎస్టిమేషన్ వేయకుండానే పనులు పూర్తి చేశారు.
- పరిగి పరిధిలోని హైదరాబాద్ మార్గంలో 33 కేవీ సైడ్ ఆరామ్స్‌లో ఒక దానికి ఎస్టిమేషన్ వేసి మరో రెండింటిని అక్రమంగా వేశారు.
- పరిగి అయ్యప్ప కాలనీలో 11 కేవీ సైడ్ ఆరామ్స్‌లో ఒక దానికి ఎస్టిమేషన్ వేసి పనులు పూర్తి చేశారు. మరో మూడు సైడ్ ఆరామ్స్, నాలుగు స్తంభాలను అక్రమంగా మార్చారు.
- పరిగి అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న ఓ ప్లాట్ లోనుంచి 11 కేవీ విద్యుత్ సరఫరా ఎర్రగడ్డపల్లికి వెళ్లింది. ఎలాంటి ఎస్టిమేషన్ లేకుండా అక్కడి నుంచి 11 కేవీ లైన్‌ను తొలగించి వేరే మార్గంలో కలిపారు. ఇలా అనేక పనులను ఎలాంటి ఎస్టిమేషన్లు లేకుండా కానిచ్చేస్తున్నారు. పరిగి విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఓ అధికారి కాంట్రాక్టర్ అవతారమెత్తి ఇష్టానుసారంగా పనులు చేసి డబ్బులు దండుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అనుమతి ఉంటేనే పనులు చేపట్టాలి

ప్రైవేటు అవసరాల కోసం విద్యుత్ కనెక్షన్లు మార్చాలన్నా, స్తంభాలు వేయాలన్నా ముందుగా దరఖాస్తు చేయాలి. ఆ తరువాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏ మేరకు ఖర్చు అవుతుందో ఎస్టిమేషన్ వేస్తారు. ఎస్టిమేషన్ మొత్తంలో 10 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత టెండర్లు పిలిచి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాలి. ఈ పనులు అధికారులు చేయడానికి అవకాశం లేదు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– సంజీవ్, డీఈ, వికారాబాద్

క్లుప్తంగా

11 లీటర్ల నాటుసారా పట్టివేత



నెల్లిగడ్డ తండాలో పటుకున్న నాటుసారా

పెద్దేముల్: నెల్లిగడ్డతండాల్లో పోలీసులు మంగళవారం రాత్రి నాటుసారను పట్టుకున్నారు. పెద్దేముల్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు నెల్లిగడ్డతండాకు చెందిన ముడావత్ మాను నాటుసార విక్రయిస్తుడనే విషయం తెలుసుకొని అతిణ్ని పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఐదు బాటిళ్ల నాటుసార సుమారు 11 లీటర్లు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితునిపై సుమొటోగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన సారాను ఎవరైనా గ్రామాల్లో విక్రయాలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ధారూరు: ధారూరు మండల కేంద్రంలో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధారూరులోని ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, మోమిన్‌ఖుర్దులో వెంకటేశ్‌గౌడ్‌షాపుల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆయా షాపులను తనిఖీ చేశామన్నారు. అక్కడ లభ్యమైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోశ్‌కుమార్ పేర్కొన్నారు.

21 లీటర్ల లిక్కర్..

ఇబ్రహీంపట్నం: బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు చేసి అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన ఉడుగుల యాదయ్య, మచ్చ గోవర్ధన్‌లు బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ ఇరువురి వద్ద సుమారు 21 లీటర్ల అక్రమ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.


పేకాటరాయుళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

ధారూరు: తిమ్మానగర్ సమీప అడవిలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సమీప అడవిలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ఆ ప్రాంతంలో దాడిచేశారు. అక్కడ పేకాటఆడుతున్న వారిని పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.9,900, సెల్‌ఫోన్లు, మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

అనంతగిరి: మున్సిపల్ పరిధిలోని గిరిగేట్ పల్లి గ్రామంలో పలు బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 20 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. ఎవరైనా మద్యం అమ్మినట్లయితే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.



పోలీసులు పట్టుకున్న మద్యం

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డోస్ట్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి

- అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- తహసీల్దార్లు, పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం
- ఎన్నికలకు సంబంధించి ప్రతీ ఖర్చు నమోదు



మాట్లాడుతున్న లింగ్యానాయక్

కొడంగల్ రూరల్: తప్పనిసరిగా అన్ని పార్టీల వారు ఎన్నికల నిబంధనలను పాటించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు అందిస్తూ శాంతియుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించుకునే సమయంలో ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతీ రాజకీయ పార్టీ సమావేశాలను వీడియోల ద్వారా పరిశీలించాలన్నారు. నామినేషన్లు సమర్పించే సమయంలో వంద మీటర్ల దూరంలో వాహనాలను, ర్యాలీలను నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేయడానికి ఒకరోజు లేదా అదే రోజు బ్యాంకు ద్వారా నూతన అకౌంటు తీసుకోవాలని, ఎన్నికలకు సంబంధించి ప్రతీ ఖర్చును బ్యాంకు ఖాతా నుంచే చేయాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు పెట్టే ఖర్చులకు ప్రత్యేక బృందాల పర్యవేక్షణ ఉంటుందని ఆయన పేర్కొనానరు. ఖర్చుల వివరాలను ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా వివరాలను సేకరిస్తామన్నారు. నియోజకవర్గంలో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామని, పటిష్ట బందోబస్తుకు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వాహనాల తనిఖీలో డబ్బులు తీసుకెళ్లకూడదని, అవసరమైన పనులకు బ్యాంకు అధికారులతో సంప్రదిస్తూ ముందస్తుగా ఏటీఎంల ద్వారా విత్ డ్రా చేసుకునేందుకు కృషిచేయాలని సూచించారు. ఎన్నికల నిఘాలో భాగంగా 16ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు తిరుగుతాయని, చెక్‌పోస్టు దగ్గర సెంట్రల్ ఫోర్స్ బలగాలతో నిఘా ఉంటుందన్నారు. ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీలవారు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు బి.విజయకుమార్, వై.వెంకటేశ్, సి.విజయకుమార్, ఆనంద్‌రావు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, ఎస్ఐలు భరత్‌రెడ్డి, శంకర్, రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ

మాతా శిశుసంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయిబాబా



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ సాయిబాబా

కుల్కచర్ల: పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత అరికట్టొచ్చని జిల్లా మాతా శిశుసంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయిబాబా అన్నారు. బుధవారం కుల్కచర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిబాబా మాట్లాడుతూ గర్భిణులు డెలివరీ వరకూ తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రిషియన్ కిట్‌లలో పోషకాలతో కూడిన సంపూర్ణఆహారం ఉందని వాటిని తీసుకుంటే గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ముఖ్యంగా ఐరన్, పోలిక్ యాసిడ్ సిరప్ తీసుకోవడంతో రక్తహీనత అదుపుచేయొచ్చన్నారు. దీంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు మెరుగైన అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళలకు తమ ఆరోగ్యసంరక్షణకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల వైద్యాధికారి మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్, వైద్య సిబ్బంది సువర్ణ, రత్నలత, యాదమ్మ, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

ఒకరి మృతి

ఆమనగల్లు: పట్టణ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆమనగల్లుకు చెందిన నాగిళ్ళ సాయిలు(60) దుర్మరణం చెందాడు. ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు పట్టణానికి చెందిన నాగిళ్ళ సాయిలు మంగళవారం రాత్రి గ్రామ శివారులో ఉన్న పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా పట్టణ సమీపంలోని సేవాలాల్ గుట్ట వద్ద హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్‌షాపులు లేకుండా చూస్తాం

అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి



మాట్లాడుతున్న నారాయణ్ అమిత్ మాలెంపాటి

ధారూరు: అసెంబ్లీ ఎన్నికలు అయ్యేంతవరకు ధారూరు మండలంలోని ఏ తండా, ఏ గ్రామంలో బెల్ట్‌షాప్‌లు లేకుండా చూస్తామని అసిస్టెంట్ కలెక్టర్, నారాయణ్ అమిత్ మాలెంపాటి అన్నారు. బుధవారం ధారూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓలు షఫీఉల్లా, సురేశ్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిని అందరు పాటించాలన్నారు. అక్రమ మద్యం అమ్మకాలపై జిల్లా ఎస్పీ, ఎక్సైజ్ సూపరింటిండెంట్‌లతో మాట్లాడుతానన్నారు. మద్యం వల్ల గ్రామాల్లో గొడవలు చెలరేగే అవకాశం ఉందన్నారు. ఏవైన ప్రచార పోస్టర్లు ఉన్నా తొలగిస్తామన్నారు. పోలింగ్ బూతుల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ
- ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన



ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌లోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమేశ్, లక్ష్మీనారాయణ, రాజేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తే వాహనాలు సీజ్

ఎస్ఐ విఠల్‌రెడ్డి



మట్టి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొన్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

మోమిన్‌పేట: అక్రమంగా మట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఏ గ్రామంలోనైనా మట్టి తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో తమకు సమాచారం ఇచ్చిన వ్యక్తి పేరును గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో మొరం, రాయిని తరలించడం చట్టరీత్య నేరమన్నారు. అనుమతులుంటేనే వాటిని తరలించాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా జేసీబీ యజమానులు అనుమతులు తీసుకున్న చోటే పనులు చేపట్టాలన్నారు.

నగదు పట్టివేత

పెద్దేముల్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందనా మంగళవారం రాత్రి తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిపై ఎస్ఐ కాశీనాథ్ సిబ్బందితో సోదాలు నిర్వహించారు. పెద్దేముల్ మండల మారేపల్లి సమీపంలో ఓ డీసీఎం బంట్వారం మండలం నుంచి పెద్దేముల్ వస్తుండగా దానిని తనిఖీ చేయగా అందులో రూ.76వేలు నగదు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకొని బుధవారం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ఎన్నికల సమయంలో తీసుకపోయే నగదుకు సంబంధించి పూర్తి వివరాలు ఉండాలన్నారు. సరైన ఆధారాలు లేనియెడల సీజ్ చేస్తామన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

బంట్వారంలో..

బంట్వారం: కర్ణాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీలో బుధవారం నగదు పట్టుబడింది. బంట్వారం మండల పరిధిలోని బొప్పునారం శివారులో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడ తాండూర్ వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. వారి నుంచి రూ.2,37,500లు పట్టుబడినట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు. మెదక్ జిల్లా సురారం గ్రామానికి చెందిన రమేశ్, నవీన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్‌దే మూడోసారి అధికారం



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. బుధవారం ఎంపీటీసీ కుమార్ ఆధ్వర్యంలో పోలెపల్లి, కొత్తకుంట తండా, మంగళికుంటతండా, చెన్నంపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శమన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో మరోసారి విజయం సాధించి అధికారంలోకి వస్తుందని తెలిపారు. విపక్ష పార్టీలు మాయమాటలు, అమలు చేయలేని వాగ్దానాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, సర్పంచులు శ్రీనయ్య, శోభా చందునాయక్, ప్రేమలత, యాదిరెడ్డి, నాయకులు సయ్యద్ ఖలీల్, జాన్యానాయక్ పాల్గొన్నారు.

దళితబంధుపై నిలదీత

అర్హులైన వారికి దళితబంధు పథకం ఇవ్వాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను మాడ్గుల మండలం చంద్రాయణపల్లి గ్రామానికి చెందిన దళితకుటుంబాలు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ళుగా నీ వెంట ఉంటున్నాం. నీకు ఓటు వేస్తున్నాం... కానీ మాకు దళితబంధు ఇవ్వడం లేదంటూ పలువురు ఎమ్మెల్యేను నిలదీశారు. నాయకులు చెప్పినవారికే దళితబంధు ఇస్తే ఎలాని ప్రశ్నించారు. అర్హులైన వారికే దళితబంధు అందిస్తామని ఎమ్మెల్యే వారికి చెప్పారు.

సీఎం బొమ్మపై సీసీఎల్‌ఏకు లేఖ

- జీఓ నంబర్ 59 భూముల రిజిస్ట్రేషన్లపై ఫొటో
- రూ.1,62,65,360 నగదు, 24 లీటర్ల మద్యం సీజ్
- వచ్చే ఎన్నికల్లో గేటెడ్ కమ్యూనిటీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటునకు కృషి
- అన్ని పార్టీలకు సమ ప్రాధాన్యం కల్పిస్తాం:
- విలేకరుల సమావేశంలో రంగారెడ్డి కలెక్టర్ హరీశ్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ×ఆక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ(జీఓ నంబర్ 59)లో భాగంగా లబ్ధిదారులకు అందజేస్తున్న రిజిస్ట్రేషన్ పత్రాలపై సీఎం ఫొటో ప్రచురించిన విషయం విధితమే. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆయా రిజిస్ట్రేషన్ పత్రాలపై సీఎం ఫొటో ఉండటాన్ని పలు రాజకీయ పార్టీలు తప్పు పడుతున్నాయి. ఇదే అంశాన్ని సీసీఎల్‌ఏకు వివరించాను. ఈ మేరకు ఇటీవల ఓ లేఖ కూడా రాశాను₹ అని జిల్లా కలెక్టర్ హరీష్ చెప్పారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్‌కు ముందు అమల్లో ఉన్న సంక్షేమ పథకాలు, పత్రాలపై అధికార పార్టీ మంత్రుల పేర్లు, ఫొటోలు ఉండటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని సీసీఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఎన్నికల కమిషన్ ఏ ఒక్క పార్టీకి అనుకూలం కాదు. ఎన్నికలు, సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తుంది. సభలు, సమావేశాలు, ప్రచారం వంటి అంశాల్లో అన్ని పార్టీలకు సమప్రాధాన్యత ఇస్తుంది.

70 మంది బైండోవర్

ఓటర్లను భయాందోళనలకు గురి చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోం. ఇప్పటికే 70మంది వీధి రౌడీలను బైండోవర్ చేశాం. నేతలు, ఇతర వ్యాపారుల వద్ద ఉన్న 58 ఆయుధాలను సరెండర్ చేయించాం. తనిఖీల్లో భాగంగా బుధవారం వరకు జిల్లాలో రూ.1, 62,65,360 నగదు స్వాధీనం చేసుకున్నాం. 24 లీటర్ల మద్యం బాటిళ్లను సీజ్ చేశాం.. ఆస్పత్రి బిల్లుల చెల్లింపు, ఇతర అవసరాల కోసం అంతకు మించి నగదు తీసుకెళ్లే వారు సంబంధిత పత్రాలను వెంట తీసుకెళ్లడం ఉత్తమం. ఇందుకోసం జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశాం. జెడ్పీ సీఈఓ దీనికి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

1206 సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో మొత్తం 33,56,056 మంది ఓటర్లు ఉన్నారు. 16,15,876 మంది మహిళా ఓటర్లు, 17,38,994 మంది పురుష ఓటర్లు, 596 మంది ఇతర ఓటర్లు, 590 సర్వీసు ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,369 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 1206 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించాం. మరో 10 అతి క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. భారీ పోలీసు బందోబస్తుతో పాటు మైక్రో అబ్జర్వర్స్ పరిశీలనలో ఉండనున్నాయి. ఎంసీఎంసీ, సోషల్ మీడియా బృందాలు పని చేస్తాయి. ఎన్నికల ఖర్చు కోసం రేట్ చార్ట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాం.

కోడ్ ఉల్లంఘిస్తే.. కేసులే..

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే వారిపై సంబంధిత చట్టాలను అనుసరిస్తూ కేసులు నమోదు చేస్తాం. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే లౌడ్ స్పీకర్లకు అనుమతి ఉంది. ఆ తర్వాత వాడితే కేసులు నమోదు చేస్తాం. కోడ్ ఉల్లంఘనలపై ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చు. ఈసారి కొత్తగా సీ–విజిల్ యాప్‌ను అందుబాటులో తెచ్చింది. ఈ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘన అంశాలు లైవ్ ఫోటోలు, వీడియోలు తీసి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావొచ్చు. ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లో భద్రత, తనిఖీ బృందాలు ఘటనా స్థలికి చేరుకుంటాయి. 80 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది.

అందుబాటులో 'సువిధ' పోర్టల్

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో సభలు, సమావేశాలకు అనుమతి లేదు. విధిగా వాటికి అనుమతి తీసుకోవాలి. ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. ఇందుకోసం ఎన్నికల కమిషన్ ×సువిధ₹ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే ముందు అనుమతి ఇస్తాం. దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే అనుమతులు జారీ చేస్తాం. అంతేకాదు ఫ్లెక్సీ తయారీ మరియు ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు కూడా జాగ్రత్తగా ఉండాలి. రాజకీయ పార్టీలు ముద్రించే కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ప్రింట్ చేసినప్పుడు వాటిపై ఫర్మ్ పేరు , ప్రింటర్ పేరు, ఫో న్ నెంబర్ విధిగా ముద్రించాలి. ప్రింటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో రిజిస్టర్లు నిర్వహించాలి. లేదంటే వారిపై చర్యలు తప్పవు.

ఏ ఒక్క పార్టీకి అనుకూలం కాదు

ఎన్నికల షెడ్యూలు రాగానే ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. అందరూ ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పని చేయాల్సిందే. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఏ ఒక్క పార్టీ వైపు మొగ్గు చూపినట్లు కన్పించినా...ప్రచార సభల్లో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ పాల్గొన్నా..అభ్యర్థుల తరఫున ప్రచారం చేసినా...అట్టి వారిపై చర్యలు తప్పవు. ఎన్నికల సంఘం ఏ ఒక్క పార్టీకి అనుకూలం కాదు.

వచ్చే ఎన్నికల నాటికి అక్కడ కూడా పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో అనేక గెటెడ్ కమ్యూనిటీలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పోలింగ్‌కేంద్రాలకు దూరంగా ఉన్నాయి. 1200పైగా ఓటర్లు ఉన్న ఆయా గెటెడ్ కమ్యూనిటీల్లోనూ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించాం. ఆ మేరకు 40 గెటెడ్ కమ్యూనిటీలకు నోటీసులు ఇచ్చాం. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఒక గెటెడ్ కమ్యూనిటీ మినహా ఇతరులు ముందుకు రాలేదు. ఏదీ ఏమైనా వచ్చే ఎన్నికల నాటికి గెటెడ్ కమ్యూనిటీల్లోనూ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి తీరుతాం.

జిల్లా విద్యార్థినికి జాతీయ స్థాయి గుర్తింపు



విద్యార్థిని పూజ

అనంతగిరి: ఈ నెల 7నుంచి 9 వరకు ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కేజీబీవీ పాఠశాల విద్యార్థిని కె.పూజ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా పూజ జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకుందని సైన్స్ అధికారి విశ్వేశ్వర్ తెలిపారు. పూజ ఆటోమెటిక్ వెజిటేబుల్ కట్టర్ ఫర్ డిసెబుల్ పీపుల్ అనే ప్రాజెక్టును తయారు చేసి పేరుగాంచింది. ఎంపికైన వారందరికి రాష్ట్రపతి సన్మానించారు. అనంతరం డీఈఓ రేణుకదేవి విద్యార్థినిని, ప్రిన్సిపాల్‌ను, గైడ్ టీచర్ మంజులను అభినందించారు. అంగవైకల్యం గలవారు ఒక చేతి సాయంతో సులభంగా వంట పనిని కొంతవరకు చేసుకోవడానికి చేసిన పరికరమని విద్యార్థిని పేర్కొన్నారు. ఇది పాత కుట్టుమిషన్‌చక్రం, సైకిల్ పైడిల్, ఒక చెక్క, బెల్ట్ లేదా చైన్‌లను ఉపయోగించి దీన్ని తయారు చేసినట్లు తెలిపారు.

దివ్యాంగులకు పథకాలు ఇవ్వాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శంకర్

ఆమనగల్లు: దివ్యాంగులకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అందించాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్ కోరారు. దివ్యాంగులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప పథకాలు అందించడం లేదని ఆయన ఆరోపించారు. మాడ్గుల మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల దివ్యాంగుల సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో శంకర్ మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 12 వేలకు పైగా దివ్యాంగుల ఓట్లు ఉన్నాయని, కల్వకుర్తి ఎమ్మెల్యే గెలుపులో దివ్యాంగుల ఓట్లు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. దివ్యాంగులకు ఆసరా పింఛన్లు మాత్రమే ఇస్తున్నారని మిగతా సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం జిల్లా కో కన్వీనర్ కొండల్‌గౌడ్, మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నాయకులు గణేశ్, లింగం, బిక్కు, యాదయ్య, అచ్చయ్య, పర్వతాలు, శాంతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

షాద్‌నగర్‌రూరల్: మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వే గేటు సమీపంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డీఐ రాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చటాన్‌పల్లి సమీపంలోని కావలిగుండు తండాకు చెందిన లక్ష్మి భర్త చనిపోవడంతో కొంత కాలంగా చటాన్‌పల్లి రైల్వేగేటు సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు సరిత, అనిత. లక్ష్మి రూం ప్రక్కనే సోనీ(హిజ్రా) నివాసం ఉంటుంది. గత కొంత కాలంగా లక్ష్మి, సోనీ చిన్నచిన్న విషయాలకు గొడవపడేవారు. ఈ క్రమంలో తన తల్లి లక్ష్మిని చూసేందుకు మహబూబ్‌నగర్ సమీపంలోని బండమీదపల్లికి చెందిన పెద్ద కూతురు సరిత బుధవారం షాద్‌నగర్‌కు వచ్చింది. ఇంటికి వచ్చిచూస్తే లక్ష్మి కనిపించలేదు. చుట్టుప్రక్కల వారిని అడిగితే కనిపించలేదని చెప్పారు. ప్రక్కనే నివాసం ఉంటున్న సోనీ(హిజ్రా) రూంకు తాళంవేసి ఉంది. ఆమెపై అనుమానంతో సరిత పోలీసులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అక్కడ సోనీ రూంనుంచి దుర్వాసన వస్తుండటంతో తలుపులు తీసి చూడగా లక్ష్మి రక్తపు మడుగులో పడి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానితురాలు సోనీ పరారీలో ఉంది. మృతురాలి కూతురు సరిత ఫిర్యాదు మేరకు డీఐ రాంరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.